ప్రజాశక్తి
శనివారం 7 సెప్టెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

అప్రమత్తంగా ఉండండి : సిఐ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అరకు సీఐ హిమగిరి చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీంతో వాగులు, వంకలు వరదలతో పొంగి ప్రవహించే పరిస్థితి ఉందని, ఎవరు కూడా భారీ వర్షాలు కురిసినప్పుడు వాగులు, వంకలు దాటకుండా గ్రామంలోనే సురక్షితంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా అరుకు, విశాఖ ఘాటి రోడ్డులో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉండడంతో సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల ప్రయాణాలను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు, పర్యాటకులు ఆ సమయల్లో తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు.

వీడని ముంపు భయం

- స్వల్పంగా తగ్గిన గోదావరి, శబరి
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విలీన మండలాల ప్రజలు

ప్రజాశక్తి-చింతూరు, విఆర్.పురం

విలీన మండలాల ప్రజలను ముంపు భయం వీడలేదు. భారీ వర్షాలు కురుస్తున్నందున వారం రోజుల పాటు గోదావరి ప్రవాహం తగ్గుతూ.. పెరుగుతూ ఉండొచ్చుని, భద్రాచలం వద్ద 40 అడుగులకు అటుఇటుగా నీటిమట్టాలు నమోదవుతాయని సిడబ్ల్యుసి అధికారులు చెబుతుండటంతో విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటూనే గడుపుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గురువారం 44.5 అడుగులు ఉండగా, శుక్రవారం నాటికి స్వల్పంగా తగ్గి 42.50 అడుగులకు చేరింది. 9.41.704 క్యూసెక్కులు గోదావరి నీరు దిగువకు విడుదలవుతోంది. చింతూరు వద్ద శబరి నది 26 అడుగులకు చేరింది. చింతూరు మండలంలోని కొండవాగులు శుక్రవారం తెల్లవారుజామున నుండి కొద్ది మేరకు తగ్గుముఖం పట్టినాయి. మల్లెతోట గ్రామాన్ని చుట్టూ ముట్టిన వరద నీరు క్రమేపి తగ్గుతుంది. సోకులేరు వాగు ఉధృతి ఇంకా పూర్తిస్థాయిలో తగ్గకపోవడంతో విఆర్.పురం- చింతూరు రహదారి ఇంకా దిగ్బంధనంలోనే ఉంది. చుట్టుపక్కల గిరిజన గ్రామాల ప్రజలు నాటు పడవల ద్వారా మండల కేంద్రాలకు వచ్చి నిత్యావసరాలను తీసుకువెళుతున్నారు. విఆర్.పురం మండలంలోని శబరి, గోదావరి సంగమంలో వరద ఇంకా తగ్గకపోవడంతో ముంపు బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ మండలంలో రహదారులు ఇంకా బయటపడలేదు. చింతూరు మండలం మల్లెతోట గ్రామంలో ముచ్చక శిరమయ్య ఇంటిపై పిడుగు పడటంతోతోపాటు పక్కనే ఉన్న వేప చెట్టు కూడా ఇంటిపై పడడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

పలు తరగతుల వారి ఉపాధికి దెబ్బ

భారీ వర్షాలు, పెరుగుతున్న వరదలు పలు తరగతుల వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వ్యాపారాలు సాగడం లేదు. ఆటో కార్మికులకు నెల రోజుల నుండి కిరాయిలు లేక కిస్తీలు కట్టలేక ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆంధ్ర ఒడిస్సా రహదారి కూడా రవాణాకు వీలు లేకుండా వరద నీరు చేరడంతో కల్లేరు, చింతూరు ఆటో కార్మికులకు రోజువారి కూలి కూడా రావటం లేదని, పూట గడవడం కష్టంగా ఉంటుందని వాపోతున్నారు. ఒరిస్సా ఛత్తీస్‌ఘడ్ వలస కార్మికులు పట్టణాలకు వెళ్లేందుకు వీలు లేకుండా ఈ వరదలు తీవ్ర ఆటంకంగా మారాయి. వర్షాల కారణంగా వ్యవసాయ కూలి పనులుగాని, ఉపాధి పనులుగాని లేక అర్ధాకలితో కూలీలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అధిక వర్షాలు కారణంగా వరి పంటలు పాడై రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు, 25 కేజీల బియ్యం, మంచి నూనె, దోమతెరలు పంపిణీ చేయాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలవరం ముంపు మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వరద బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

గోదావరి వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం వాసులు

బాధితులకు కందిపప్పు, వంటనూనె అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటిడిఎ పిఒ

ముంపు ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

విఆర్.పురం : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం విఆర్.పురం మండలంలోని వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. శ్రీరామగిరి గ్రామంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవితో కలిసి వరద బాధితులకు కందిపప్పు, వంటనూనె పంపిణీ చేశారు. వరద నీరు తగ్గకపోవడంతో చింతరేగుపల్లి గ్రామానికి పడవలపై వెళ్లారు. దోమకాటు ఎక్కువగా ఉందని ముందు జాగ్రత్తగా ఆ గ్రామంలో దోమ తెరలు పంపిణీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని, వారికి మనో ధైర్యం నింపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు, ఎంపీడిఓ ఫణీంద్రరెడ్డి, ఆర్ఐ రామకృష్ణ, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, పోలీసు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విఆర్.పురం మండలం అడవి వెంకన్నగూడెం, రామవరం గ్రామాల మధ్య నీట మునిగిన వరి పొలాలు

విఆర్.పురం మండలం చింతరేగుపల్లి గ్రామానికి పడవపై వెళ్తున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

సీలేరులో భారీ వర్షం

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకి కొంత సమయం అంతరాయం ఏర్పడింది. అనంతరం విద్యుత్ ఉద్యోగులు లోపాలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మళ్లీ ఉదయం 9 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటలకు కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. సాయంత్రం పాఠశాలలు విడిడిపెట్టే సమయంలో వర్షం కురవడంతో విద్యార్థులు తడిసి ముద్దయ్యారు. సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, సప్పర్ల పంచాయితీల పరిధిలో వర్షాలు కురుస్తుండడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాగులు పొంగుతుండడంతో మారుమూల గ్రామాల గిరిజనులు వారి అవసరాల నిమిత్తం రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా పోయింది.

విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నేతలు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఇటీవల కురిసిన భారీ వరదలకు గురైన విజయవాడ బాధితులకు అండగా నిలిసి ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అరకులోయ మండల కేంద్రంలోని శుక్రవారం ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, బాధితులను మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరు విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. విరాళాలు ఇచ్చిన సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ నాయకులు కె మగ్గన్న, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ దాడి రాజు, సింహాచలం, రఘువరన్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు వివిధ రకాలైన వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహల్లో స్థానిక ప్రధానోపాధ్యాయులు, వార్డేన్లతో పాటు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు చేయాలన్నారు. విద్యార్థులకు వేడినీటిని 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి మోహన్ దాస్, కే రామకృష్ణ, వి.రామూర్తి, పి మత్తు, జి మహేష్, పి.తిలక్, కే.భాష్కర్ రావు పాల్గొన్నారు.

వారం రోజుల్లో 25 మేకలు మృతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీలోని కురిసేల గ్రామంలో వారం రోజుల నుంచి అంతుచిక్కని వ్యాధితో మేకలు మృత్యువాత పడుతున్నాయి. వారం రోజుల నుంచి ఇప్పటి వరకు 25కి పైగా మేకలు మృ తి చెందాయి. దీంతో వ్యాధులు రోజురోజుకు విజృంభిస్తున్నాయి. వ్యాధి లక్షణాల్లో ముందుగా విరోచనాలు వస్తున్నాయని ఆ తరువాత రెండు మూడు రోజులు తరవాత మృతి చెందుతున్నట్లు మేకలు కాపరులు తెలిపారు. అంతుచిక్కని వ్యాధితో చనిపోతున్నా ఇంత వరకు పశు వైద్య అధికారులు వైద్యశిబిరం నిర్వహించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వైద్యశిబిరాలను నిర్వహించి, మేకలను కాపాడాలని ప్రజలు, పెంపకందారులు కోరుతున్నారు.



మృతి చెందిన మేక పిల్లలు

శ్యామల వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషి

28వ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నేతలు

ప్రజాశక్తి-చింతూరు

అమరజీవి కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని సిపిఎం నాయకులు ప్రతినబూనారు. వెంకటరెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిపిఎం కార్యాలయం వెంకటరెడ్డి స్మారక స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి సీసన్ సురేష్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు పెద్దరాములు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ నరహంతక నక్సలైట్లు మల్లంపేటలో దారికాచి గొడ్డలితో దాడి చేసి వెంకటరెడ్డిని హత్య చేశారని గుర్తు చేశారు. శ్రామిక, కార్మిక, కర్షక, గిరిజన అభ్యున్నతికి పాటుపడుతూ దళారీల వ్యవస్థ నుండి దోపిడీదారుల నుండి ప్రజలను కాపాడుతూ మన్యం పులిగా తిరుగులేని నాయకుడుగా ఎదుగుతున్న తరుణంలో వెంకటరెడ్డిని హతమార్చారని తెలిపారు. మన్యం విడిచి వెళ్లిపొమ్మని, లేకుంటే చంపుతామని అనేకసార్లు నక్సలైట్లు బెదిరింపులకు పాల్పడినా వెంకటరెడ్డి ఏమాత్రం జంకు బెంకు లేకుండా తన చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవకై పనిచేస్తూ ఇక్కడే ఉంటానని తెగేసిచెప్పిన విప్లవ వీరుడు శ్యామల వెంకటరెడ్డిని అని పేర్కొన్నారు. వ్యవసాయం అంటే ఏమిటో తెలియని మల్లంపేట పరిసర ప్రాంత గిరిజనులకు వ్యవసాయ పద్ధతులు నేర్పారని, రవాణా వ్యవస్థ లేని మారుమూల అటవీ ప్రాంతానికి ప్రభుత్వంపై పోరాడి బీటీ రోడ్డు వేయించిన ఘనత వెంకటరెడ్డికే దక్కుతుందన్నారు. నిబద్ధత, నిజాయితీ, కుండబద్దలు కొట్టేలా మాట తీరు వెంకటరెడ్డి సొంతమని, ఆయన అమరుడవైన తమలో ఆయన ఆశయ రూపం దాగి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, పోడియం లక్ష్మణ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేఖపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

విఆర్.పురం : కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిపిఎం కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపిపి కారం లక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్సలైట్లు చంపుతారని తెలిసి కూడా అత్యంత ధైర్య సాహసాలతో భద్రాచలం డివిజన్ పేద ప్రజల సమస్యలపైన గిరిజనుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సోడి మల్లయ్య, కారం సుందరయ్య, ప్రకాష్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరులోని స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వినాయక చవితి సందడి

రద్దీగా ఉన్న సంత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రతి వీధిలో వినాయక చవితి సందడి మొదలైంది. చవితి సంబరాలకు ఊరూరు..వాడవాడల ముస్తాబయ్యాయి. విగ్రహాల కొనుగోలు చేసి ట్రాక్టర్లు ఇతర వాహనాల్లో మండపాలకు తీసుకెళ్లారు.

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం నుంచే వినాయక చవితి శోభను సంతరించుకుంది. ఒకవైపు వారపు సంత మరోవైపు పండుగ కలిసి రావడంతో దుకాణాలన్నీ కొనుగోరుదారులతో కిటకిటలాడాయి. చవితి పూజ సామాగ్రి కొనుగోలు కేంద్రాలు ప్రధాన రహదారుల పక్కనే ఏర్పాటు చేయడంతో పూలు, పండ్లు, పత్రి ఇతర సామాగ్రి కొనే వారితో ప్రధాన రహదారులు రద్దీగా మారాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూపాల్లో బొజ్జ గణపయ్య ప్రతిమలు దర్శనమిస్తున్నాయి. శనివారం చవితి పండగ కావడంతో పట్టణంలోని అన్ని మార్కెట్ లలో ఆకట్టుకునే వినాయక విగ్రహాల కొనుగోలు జోరుగా సాగింది. పూజకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి జనం పాడేరు మార్కెట్ కు తరలి రావడంతో సందడి నెలకొంది. ఉదయం నుంచి ఒక మోస్తారుగా ఉన్న జనం సాయంత్రానికి రెట్టింపు అయ్యారు.

పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ సెంటర్, మెయిన్ బజార్ ప్రాంతమంతా కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. రంగులతో తీర్చిదిద్దిన వినాయకుని విగ్రహాలను ఇళ్లలో పూజించేందుకు రూ.100 నుంచి 300 వరకు సైజును బట్టి విక్రయించారు. కొబ్బరి, అరటి, యాపిల్, బత్తాయి, దానిమ్మ, ద్రాక్ష, సీతాఫలం, పూలు తదితరాల ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా వ్యాప్తంగా ఊరు వాడల్లో విభిన్న హంగులతో మండపాలు తీర్చిదిద్దారు.

వాహనంలోకి విగ్రహాన్ని ఎక్కిస్తున్న నిర్వాహకులు

'మీ కోసం'కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పి. ఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ పద్మావతి సంయుక్తంగా వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 109 వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీ బొడ్డ మామిడి గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు జి.సుందర రావు, జి.గోవర్ధన్ వినతి పత్రం సమర్పించారు. అదే పంచాయతీలోని బొడ్డమామిడి జంక్షన్ నుండి డెక్కపారు గ్రామం వరకు తారు రోడ్డు నిర్మించాలని బి.త్రినాదరావు వినతి పత్రం అందజేసారు. ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు పంచాయతీ కెందుపుట్టు గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మించాలని గ్రామస్తుడు ఎం.కృష్ణమూర్తి దరఖాస్తును సమర్పించారు. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామంలో గ్రామ కంఠం భూమి దురాక్రమణకు గురైందని, సర్వే చేసి ఇళ్లు లేని పేదలకు గ్రామ కంఠంలో ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ కె. సత్యనారాయణ దరఖాస్తులో కోరారు. ముంచంగిపుట్టు మండలానికి చెందిన కొర్రా డొంబ్రి ఉపాధి హామీ పథకంలో చేపల చెరువు తవ్వించి తనకు కేటాయిస్తే చేపలు పెంపకం చేపట్టి ఉపాధి పొందుతానని వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండలం లోతు గెడ్డ గ్రామానికి చెందిన చింతర్ల సునీల్ కుమార్ తన పాడిగేదె ఈనెల 2వ తేదీన పాలంగట్టు మీద నుండి పడిపోయి మృతి చెందిందని నష్ట పరిహారం అందించాలని వినతి పత్రం లో పేర్కొన్నారు. ఈ విధంగా పలువురు దరఖాస్తులను అందజేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఎస్.డి.సి. వి వి ఎస్. శర్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న పిఒ,

వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

పంట నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీ కరకవలస గ్రామంలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాలకు నీటి మునిగి పంటను క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటన చేసి నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయ మండల తహశల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, కె.బుజ్జి బాబు, కె రామారావు మాట్లాడుతూ,.జిఓ 7 రద్దు చేసి ఎవరైతే పంట నష్టపోయారో వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో రైతులు తమకున్నటువంటి తక్కువ సాగు భూమిలో వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాధిస్తుంటారని తెలిపారు. జిఓ 7 ప్రకారం 33 శాతం నష్టం జరిగితే నష్ట పరిహారం చెల్లించే అవకాశం ఉన్నందున గిరిజ నులకు తీవ్ర నష్టమన్నారు. జి.ఓ 7ని రద్దు చేసి గతంలో ఎలాగైతే అధికారులు పర్యటించి నష్టపోయిన రైతుల పంటను అంచన వేసి నష్టపరిహారం చెల్లించేవాల్లో ఆ విధంగా చెల్లించి రైతులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంగన్వాడీ కేంద్రం మంజూరుకు వినతి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ కరకవలస గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేయించాలని మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ ను ఆ పంచాయతీ నాయకులు విన్నవించారు. పాడేరులోని ఆయన కార్యాలయంలో కలిసిన ఆ పార్టీ నాయకులు అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయించి చిన్నారుల కష్టాలను తీర్చాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కరకవలసలో సుమారు 41మంది అయిదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వీరికి అయిదు కిలోమీటర్ల దూరంలోని మాలివలస అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం అందుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆ పంచాయతీ బూత్ ఇన్చార్జి కమలకర్ తెలిపారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అంగన్వాడి కేంద్రం మంజూరయ్యేలా చూస్తానని హామీనిచ్చారని పార్టీ నాయకులు తెలిపారు . ఆ పార్టీ నాయకులు మొద్దు, దొన్ను, గాసి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి హుకుంపేట:-మండలంలోని అండిభ భీమవరం బంగారు బుడ్డి తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీ హెచ్ ఇ ఓ కూడా మహేష్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపై ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన అన్నారు. వర్షాల సీజన్ కావడంతో కలుషిత నీరు తాగకుండా వేడిగా చల్లార్చి నీరు తాగాలన్నారు. చిన్న చిన్న జ్వరాలకు భయాందోళన చెందకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తుంబవలసలో జ్వరాలు

ప్రజాశక్తి-హుకుంపేట:తుంబవలస గ్రామంలో గిరిజనులు చలి జ్వరాలతో అవస్థలు పడుతున్నారు. పది రోజుల నుంచి రోగాల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. రోగాలు తగు ముఖం పట్టక పోవడంతో ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే వర్షానికి వాహనాలు లేక అల్లాడుతున్నారు. మండలంలోని చివరి గ్రామం కావడంతో ఏ సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పథకాలు అందించేందుకే ఇంటింటా సర్వే

ప్రజాశక్తి- అనంతగిరి:పివిటిజి ఆదివాసి గిరిజన ప్రజలకు కేంద్ర ప్రభుత్వం కల్పించే వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకే ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని మండల పరిషత్ ఏవో లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ కిల్లో. మొస్య ఆధ్వర్యన టోకురు పంచాయతీ పరిధి బొరిబొరివలస, జాకరవలస గ్రామాలలో సందర్శించి ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం సర్పంచ్ మొస్య మాట్లాడుతూ, పీఎం జన్ మన్ పథకం ద్వారా ఇల్లు, సిసి రోడ్లు, ఇతర వసతులు మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్, త్రినాథ్, వార్డు మెంబర్ రామ్మూర్తి గ్రామ పెద్దలు నరజి , దొన్ను తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి సదస్సులో ఎయు అధికారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఉన్నత విద్యామండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఎయు అధికారులు పాల్గొన్నారు. శుక్రవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరం నుంచి వర్చువల్ విధానంలో జరిగిన ఈ సదస్సులో వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీమ్ లీజ్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్స్ అందించడం, ఓడిఎల్ విధానంలో కోర్సుల నిర్వహణ, డిజిటల్ స్కిల్స్ అంశాలను అందించడంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు.

మన్యంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోతవానలతో గోస్తనీ, శారద నదులు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుమ్మకోట, గరుగుబిల్లి, పంచాయతీలో గెడ్డలు, విజయనగరం ఆంధ్ర డ్యామ్, బీంపోలు, బోర్రా ,కొండిభ ,కొత్తురు, కాశీపట్నంలో ఉన్న గెడ్డలను ఆనుకుని ఉన్న మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. ఇళ్లకే పరిమితమైన పరిస్థితి ఏర్పడింది. గురు,శుక్రవారం రెండు రోజులుగా కురిసిన కుండపోత వానతో అనంతగిరి, అరకు ఘాట్ రోడ్లలలో పలుచోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. కొండవాగు నుండి ప్రధాన రహదారిలో భారీ ఎత్తున వరద నీరు చేరింది. పంట పొలాలు మునిగిపోయాయి.ప్రజల రాకపోకలకు అంతరాయం నెలకొంది.

ఉప్పొంగి ప్రవహిస్తున్న గెడ్డ

డుంబ్రిగుడ : మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కొద్దిపాటి వర్షం కురుస్తూ సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో అరకు వారపు సంతలు కూరగాయలు, అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి వెళ్లిన రైతులు, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన మారుమూల ప్రాంతం గిరిజనులు తిరుగు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చంప పట్టి,కితలంగి, చాపరాయి జలపాతం గెడ్డలు పొంగి ప్రవహించడంతో ఆ ప్రాంత గ్రామాలకు వెళ్లే గిరిజనులు పలు పడ్డారు.

ప్రమాదభరితంగా గెడ్డలు

వేరువేరు చోట్ల గెడ్డలలో గల్లంతైన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా గిరిజనుడు ప్రాణాలతో బయటపడిన ఘటన మండలంలోని చోటుచేసుకుంది. గురువారం మండలంలోని కురిసిన కుండపోత వానకు గెడ్డలు ఉప్పొంగి ప్రవేశిస్తున్నాయి. ఎగువశోభ పంచాయతీ సరసుపదర్ గ్రామానికి చెందిన కోనేపు డొమిని జామగుడ, కమలపురం వద్ద ఉన్న గెడ్డను గురువారం దాటుతుండగా గల్లంతై మృతి చెందింది. టోకురు పంచాయతీ రాయివలస గ్రామనికి చెందిన సోంటరి దొన్ను చిటంపాడు, జోగిబంద గెడ్డను ఇద్దరు తోటీ స్నేహితులతో దాటుతుండగా వరద ప్రవాహానికి కొంత దూరం కొట్టుకుపోయి చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలతో బయట పడ్డాడు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతోందని మీ కోసం లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని ఐటిడిఏ పి.ఓ. అభిషేక్ ఆగ్రహం వ్యక్తం చేసారు. మీకోసం కార్యక్రమం అనంతరం ఐ టి డి ఎస్ సమావేశ మందిరంలో అధికారులతో శుక్రవారం సమావేశ మయ్యారు. మీ కోసం జరుగుతుండగా అనుమతి తీసుకోకుండా అధికారులు ఇష్టా రాజ్యంగా బయటకు వెళ్లి పోవడాన్ని ఆయన తప్పుపట్టారు. సబ్ ఆర్డినేట్ సిబ్బందిని మీకోసం కు పంపి అధికారులు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. మీకోసం హాలు నుండి అనుమతి లేకుండా బయటకు వెళ్లిన ట్రాన్స్కో, ఇ ఇ అప్పారావుకు సోకాజ్ నోటీసు జారీ చేయాలని డి. ఆర్. ఓను ఆదేశించారు. మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులందరిపైనా ఉందన్నారు. ఫైల్సును సంబంధిత కార్యాలయం ద్వారా పంపించాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు తగిన విధంగా స్పందించి వివరణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్య మన్ పటేల్ , డిఆర్ఓ బి పద్మావతి, ఎస్ డి సి వివిఎస్ శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ .కొండలరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్యారావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొట్నాపల్లి పంచాయతీ మత్యపురం ఎంపీపీ పాఠశాల ఉపధ్యాయులు మోశ్య సత్యారావు ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డును ఎంపీ గుమ్మ తనుజ రాణి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. సామాన్య కుటుంబానికి చెందిన మోశ్య సత్యారావు 2003లో ఉపాధ్యాయ వృత్తి లో బాధ్యతలు చేపట్టారు.ఎందరో విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసి, అందరి మన్ననలు పొందారు. విద్యార్థులకు, మార్గదర్శకంగా నిలిచి ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. ఎందరో విద్యార్థులను ఏకలవ్య మోడల్ స్కూల్స్ (ఇంగ్లీష్ మీడియం) ఏపీఆర్ తదితర పాఠశాలలకు పంపించారు.వృత్తిపై అంకితభావం, నేర్పరితనం, నిబద్ధతతో విద్యా బోధన సాగిస్తున్నారు. ఏపిటిఎఫ్ మండల అధ్యక్షుడుగా అనేక సేవలు అందిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం గ్రామంలో శుక్రవారం పిడుగుపాటుకు గురై మహిళ మృతి చెందినట్లు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. పెద గొల్లలపాలెం గ్రామానికి చెందిన వంగలపూడి రాములమ్మ (56) శుక్రవారం కూలిపనికి వెళ్లి వర్షంతో పొలంలో వరి నాట్లు వేస్తోంది. ఈ సమయంలో ఆమెకు దగ్గరిలో పిడుగుపడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లుగా తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులు నాగరాజు, పైడిరాజు, కుమార్తె గంగతల్లి ఉన్నారు.

మత్స్యరంగంపై పరిశోధనలకు సిఐఎఫ్‌టితో గీతం ఎంఒయు

ప్రజాశక్తి-మధురవాడ : మత్స్యరంగంపై సంయుక్త పరిశోధనలను చేపట్టడానికి వీలుగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలికి చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సిఐఎఫ్‌టి)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, సిఐఎఫ్‌టి (కొచ్చిన్) డైరెక్టర్ డాక్టర్ జార్జి నినన్‌తో అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సిఐఎఫ్‌టి డైరెక్టర్ డాక్టర్ జార్జి నినన్ మాట్లాడుతూ, దేశంలోని మత్స్యరంగంలో పరిశ్రమలకు, మత్స్యకారులకు, పరిశోధకులకు, యువతకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలోని గుజరాత్, మహారాష్ట్రతో పాటు విశాఖలోని సిఐఎఫ్‌టి పరిశోధన కేంద్రం పలు విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తోందన్నారు. మత్స్యరంగంలో యువతకు అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని, 400కుపైగా బిజినెస్ ఇంక్యుబేటర్‌లను ప్రోత్సహించామని తెలిపారు. గీతంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా మత్స్యరంగంలో పరిశోధనలకు, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడానికి సహకరిస్తామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు పరిశోధనలకు గీతం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దాదాపు రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలు, పరిశ్రమలతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గీతం అధ్యాపకులు పరిశ్రమలకు కన్సల్టెన్సి సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ, సముద్ర సంబంధ పరిశోధనల పట్ల తాము ఆసక్తితో ఉన్నామని, దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్ఐఒ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. సిఐఎఫ్‌టి సహకారంతో మత్స్య రంగంపై సంయుక్త ప్రాజెక్టులను నిర్వహిస్తామన్నారు. సిఐఎఫ్‌టి విశాఖ శాఖ అధిపతి డాక్టర్ శ్రీధర్ మట్లాడుతూ, మత్స్యసంబంధ పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గీతం జీవశాస్త్ర విభాగాల అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ అనిత, డాక్టర్ కిరణ్మయి, డాక్టర సన్ముఖానంద తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్య సేవలుండాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - ఆరిలోవ : అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వైద్యసేవలుండాలని కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆరిలోవ హెల్త్‌సిటీలో మెడికవర్ కేన్సర్ ఆసుపత్రి విభాగాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, మెడికవర్ ఆసుపత్రి సేవలు ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. కేవలం దశాబ్దం కాలంలో నాలుగు రాష్ట్రాల్లో 23 ఆసుపత్రులు, ప్రపంచంలో 9 దేశాలలో 1200 మంది వైద్యులు, 13 వేల మంది వైద్య సిబ్బందితో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలందిస్తున్న స్థాయికి మెడికవర్ ఆసుపత్రి చేరుకోవడం అభినందనీయమన్నారు. నానాటికి పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, కలుషిత ఆహారం, జీవన శైలి కారణంగా వయస్సుతో నిమిత్తం లేకుండా విజృంభిస్తున్న కేన్సర్ వంటి భయంకర వ్యాధిని ఎదుర్కోవడానికి ప్రత్యేక ఆసుపత్రులు విస్తరింప చేయడం అవసరమన్నారు. ఇందులో భాగంగా మెడికవర్ ఆసుపత్రి ప్రత్యేకంగా కేన్సర్ చికిత్స విభాగాన్ని ప్రారంభించడం హర్షదాయకమన్నారు. పేదలకు అందుబాటు ధరల్లో వైద్యసేవలు అందించాలని యాజమాన్యాన్ని కోరారు.

ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న ఎంపిపి, సిపిఎం నాయకులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

- ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎంపిపి, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం : వర్షాలు, వరదలు కారణంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్ వంటి రోగాలు బారిన ప్రజలు పడ్డారని, వారికి సరైన వైద్యం అందించాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎంపిపి కారం లక్ష్మి వైద్యులకు సూచించారు. మండలంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఎంపీపీ కారం లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు సందర్శించారు. ఆసుపత్రిలో జ్వరాలతో బెడ్లపై ఉన్న రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్యులు, ఆశా వర్కర్లు గ్రామాలను సందర్శించి ప్రజలు ఎలాంటి వ్యాధులు బారిన పడకుండా చూడాలన్నారు. అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని, రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపకుండా ఇక్కడే వైద్యులు సరైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడో కాన్పులో సిజేరియన్ విజయవంతం

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని కుమ్మూరు పంచాయతీ మామిళ్ళ గూడెం గ్రామానికి చెందిన వశ్చిక రమణ అనే గర్భిణీకి మూడో కాన్పులోనూ సిజేరియన్ ఆపరేషన్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో వియవంతంగా చేశారు. రమణకు మూడో కాన్పులో ఆపరేషన్ చేయడం ప్రమాదమని ఆసుపత్రి వైద్యులు కాకినాడ పంపించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు బేడే సతీష్, శీలం తమ్మయ్య ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డితో మాట్లాడి వాళ్ళ ఆర్థిక పరిస్థితిని వివరించి ఇక్కడే సౌకర్యవంతంగా ఆపరేషన్ చేయాలని కోరారు. దానికి సమ్మతించిన వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ వియవంతంగా చేశారు.

విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో..

నిర్విరామంగా జివిఎంసి పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో మూడు రోజుల నుండి నిర్విరామంగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నట్టు జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలోగల 20 నుంచి 64 వార్డుల పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లో మూడు రోజుల నుండి ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నామన్నారు. బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తూ, మధురానగర్, అజిత్ సింగ్ నగర్, వాంబే కాలనీ, కండ్రిక తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను నిర్విరామంగా కొనసాగిస్తున్నామన్నారు. జివిఎంసి నుండి తీసుకువెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వెహికల్స్, అందుబాటులోనున్న ట్రాక్టర్ల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేస్తున్నామన్నారు. ఈ సహాయక చర్యలు మరో మూడు, నాలుగు రోజులు పాటు కొనసాగుతాయని తెలిపారు.

ఎమ్మెల్యే వాసుపల్లి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ ఆదిశక్తి అమ్మవారి వాడబల్జి సేవా సంఘానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైసిపి సీనియర్ నాయకులు లింగం శ్రీను, ఎర్నిమాంబ అమ్మవారి గుడి చైర్మన్ లండ రమణ, అప్పలరాజు, సత్తిబాబు, దూడ అప్పారావు, నాగమణి, దానియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేసిన తరువాతే పనులు

లేకుంటే ఉదమం తప్పదు
పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-సీలేరు

పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసిన తరువాతే ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని, లేకుంటే ఉద్యమం తప్పదని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఏపీ జెన్కో అధికారులను హెచ్చరించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా విశ్వేశ్వరరాజు సీలేరులో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పంపు స్టోరేజీ ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాలైన దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి, వలస గెడ్డ, బూసికొండను సందర్శించారు. అక్కడ ప్రజలతో సమావేశమై పంపు స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరుగుతున్న నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు వలన భూములు, ఇళ్లు కోల్పోతున్నామని ఎమ్మెల్యేకి నిర్వాసితులు తెలిపారు. అనంతరం సీలేరు జల విద్యుత్ కేంద్ర సమీపంలో ఉన్న పార్వతీనగర్ గ్రామానికి చేరుకొని పంపు స్టోరేజ్ ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ రాంభద్రరాజుతో సమావేశమై నిర్వాసితులు సమస్యలపై చర్చించారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వలన నిర్వాసితులైన వారికి ఇళ్లు, ఇంటికొకరి ఉద్యోగం కల్పించిన తరువాతే పంపు స్టోరేజ్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని సూచించారు. పార్వతి నగర్ గ్రామస్తులకు వేరొక చోట ఏపీ జెన్కో నూతనంగా ఇళ్లు నిర్మించి పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తే ఆ గ్రామాన్ని ఖాళీ చేస్తారని, అంతవరకు ఖాళీ చేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీనికి పంపు స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి స్పందిస్తూ సమస్యలను కలెక్టరు, రెవెన్యూ, ఏపీ జెన్కో ఉన్నతాధికారుల దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్తామని చెప్పారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌తో సమావేశమై చర్చించడానికి నిర్వాసితులు, ఎమ్మెల్యే, ఎస్ఇ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో పంపు స్టోరేజ్ ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, వైసిపి మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, దామనాపల్లి సర్పంచ్ కుంజేటి రామకృష్ణ, గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ, స్థానిక ఎంపిటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచి దుర్గో, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, వైసీపీ నాయకులు స్వర్ణలత, గణేష్, బుజ్జి, గిరిజన సంఘం నాయకుడు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పంప్డు స్టోరేజీ ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

గురుకుల పాఠశాల సందర్శన

జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆకస్మితంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు ప్రతిరోజు పెడుతున్నారా లేదా అని ప్రిన్సిపల్ బుచ్చిబాబును అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌ను పరిశీలించి ఉడకపెట్టిన గుడ్డులో కుళ్ళిన గుడ్లు ఉండడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ గడ్లు ఎప్పటివో అడగ్గా వార్డెన్, హెచ్ఎం పొంత లేని సమాధానాలు చెప్పారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించడంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

మండల పరిషత్తు సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా

కోరం లేక వాయిదా పడ్డ పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి -దేవీపట్నం

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశానికి మండలంలోని మెజారిటీ ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. శుక్రవారం దేవీపట్నం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి కుంజం మురళి అధ్యక్షతన జరగవలసి ఉంది. ఎనిమిది మంది ఎంపిటిసి సభ్యులకుగాను ఇద్దరు ఎంపిటిసిలు, ఒక కో-ఆప్షన్ మెంబర్ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ఎంపిడిఓ రత్న కుమారి ప్రకటించారు. ప్రజల చేత ఎన్నికోబడిన ప్రజాప్రతినిధులు మండల పరిషత్తు సమావేశానికి హాజరై తమ పరిధిలోని సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయవలసిన బాధ్యత వారిపై ఉంది. కాని వారు మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి డుమ్మా కొట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సమావేశానికి వివిధ శాఖల అధికారులు కూడా అనుకున్న స్థాయిలో హాజరు కాకపోవడం విశేషం. గతంలో కూడా సర్వసభ్య సమావేశం ఇలాగే వాయిదా పడింది. మండల షరిషత్తు సమావేశాలు ఇలా వాయిదా పడడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సమావేశాలకు హాజరు కాకపోతే ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేది ఎవరు? ఆ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జిఒ 115పై నర్సుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిఒ 115ను రద్దు చేయాలంటూ శుక్రవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నర్సులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు లలిత, ప్రధాన కార్యదర్శి టిజిఎస్ఎన్.కుమారి మాట్లాడుతూ శని, ఆదివారాలలో కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలపాలని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే సోమవారం నుంచి విధులు బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న దాదాపు 11500 మంది స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. భవిష్యత్తులో రెగ్యులర్ నోటిఫికేషన్స్ ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఐదుగురు స్టాఫ్ నర్సులను నియమించాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో భద్రతా సిబ్బందిని నియమించాలన్నారు. కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులకు రూ.50 లక్షల బీమాను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సలను వెంటనే పరస్పర అంగీకార బదిలీలకు అనుమతించాలని కోరారు. ఈ మేరకు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందకు వినతిపత్రం సమర్పించారు.

తయారు చేసిన వినాయక ప్రతిమలతో విద్యార్థులు

మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాల విద్యార్థులు మట్టి, పసుపుతో కూడిన వినాయక విగ్రహాలు తయారు చేసి శుక్రవారం పాఠశాలల్లో ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్, పిఈటి కమలాకర్, ఉపాధ్యాయులు పాల నరేష్, ఓం నమశ్శివాయ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ బొగ్గు కొరత సమస్యను పరిష్కరించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన వారిద్దరికీ లేఖలు పంపారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కొన్ని నెలల నుంచి బొగ్గు కొరతతో తీవ్ర ఉత్పత్తి సమస్యను ఎదుర్కొంటోందన్నారు. ఇప్పుడు ప్రమాద స్థితికి చేరి ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదంలో పడిందని తెలిపారు. అదానీ గంగవరం పోర్టు కుట్రతో సాగుతున్న ఆటంకాలను తెలిపారు.

ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ విదేశాల నుంచి రప్పించిన బొగ్గు గంగవరం పోర్టులో లక్షా 54 వేల టన్నులు ఉందన్నారు. అలాగే విశాఖపట్నం పోర్టులో మరో 89 వేల టన్నులు విదేశీ బొగ్గు ఉందన్నారు. బకాయి చెల్లించాలనే పేర కొంతమంది ట్రేడర్లు పోర్టులో ఉన్న విదేశీ బొగ్గుపై హైకోర్టు నుండి అటాచ్‌మెంట్ తీసుకువచ్చి బొగ్గును తమ ఆధీనంలోకి తీసుకొని, స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి జరగనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ మూతపడే ప్రమాదస్థితికి చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వ అండతో ప్లాంట్‌ను నష్టాలపాలు చేసి మూసివేయించాలనే కుట్రతో అదానీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని బొగ్గును విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎలాంటి ఆటంకమూ లేకుండా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విశాఖ ప్రజలకు ఉక్కు రక్షణపై ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి విశాఖకు వచ్చి ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కర్మాగారాన్ని అర్ధాంతరంగా మూసివేసే చర్యలను తీసుకుంటోందన్నారు. కార్మికులు, ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు, సదుపాయాలపై కోత విధించే చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. ఇటీవల తప్పుడు ఆరోపణలు మోపి 272 మంది ఇంజినీర్లుకు షోకాజ్ నోటీలు ఇచ్చి భయాందోళనకు గురిచేసిందని తెలిపారు. అత్యంత బాధ్యతారహితంగా, అవినీతి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు.

హెల్మెట్ ధరించని వారిపై కొరడా

- 837 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. వాహనదారుల వెనుక కూర్చున్నవారు హెల్మెట్ ధరించకున్నా శిక్షలు విధించారు. 837 మంది డ్రైవింగ్ లైసెన్సులను 3 నెలల పాటు రద్దు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజరత్నం శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు 22,325 కేసులు నమోదు చేశామని, వాటిలో 837 మంది డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు.